నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ జి. నాగేశ్వరరావు తెలిపారు. బర్కత్‌పుర పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు, మూన్ కేఫ్ పరిధిలో ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు, డీడీ కాలనీ పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.



సీజీవో టవర్స్ చౌరస్తా వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాములు, సెంట్రల్ జోన్ డీసీపీ మోహన్‌కుమార్ తదితరులు

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ముషీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అడిషనల్ డీసీపీ రాములు సూచించారు. శుక్రవారం సీజీవో టవర్స్ చౌరస్తా వద్ద ఫ్రీ లెఫ్ట్ అమలు చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజీవో టవర్స్ వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ ఎస్. మోహన్‌కుమార్, గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి, ఎస్‌ఐ పెంటాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తాత్కాలిక షెడ్ల పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ టి. రవీందర్ తదితరులు

కనకాల కట్టమైసమ్మ ఆలయం వద్ద తాత్కాలిక షెడ్లు

కవాడిగూడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద తాత్కాలిక షెడ్ల ఏర్పాటు కట్టమైసమ్మ భక్త సమాజం పోరాటం వల్లే జరిగిందని భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్ తెలిపారు. శుక్రవారం దేవాలయ సమీపంలో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక షెడ్లను ఆయనతోపాటు ప్రతినిధులు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, జి. వెంకటేష్, కె. పరిమల్ కుమార్, ఎంసీ మహేందర్‌బాబు, బీజేపీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బొల్లా రమేష్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు ఎ. ప్రభాకర్ గంగపుత్ర తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

భోలక్‌పూర్‌లో ఎమ్మెల్సీ పర్యటన



భోలక్‌పూర్ డివిజన్‌లో ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌బేగ్ కద్రీ, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ శుక్రవారం పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ యామీన్ ఖాన్, నాయకులు దావూద్ అలీ, అక్లక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

- ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలి

చిక్కడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మకు విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల స్థానిక సంస్థల ప్రాతినిధ్య సాధన కమిటీ ప్రతినిధుల బృందం శుక్రవారం మంత్రిని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఎండీ షఫీ అహ్మద్, వైస్ చైర్మన్ దైనంపల్లి మల్లికార్జున్, సభ్యులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు

ఆర్టీసీ కాచిగూడ డిపో డ్రైవర్, కండక్టర్లకు అవార్డులు

బర్కత్‌పుర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ బాబునాయక్ అన్నారు. శుక్రవారం కాచిగూడ డిపోలో అత్యధిక ఈపీకే తెచ్చిన కండక్టర్లకు నగదు బహుమతి, ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవార్డులు అందుకున్న వారిని మిగతా డ్రైవర్లు, కండక్టర్లు ఆదర్శంగా తీసుకుని ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో కాచిగూడ డిపో మేనేజర్ డీసీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాచిగూడ-భగత్‌కీకోటి రైలు ప్రారంభం

బర్కత్‌పుర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్థిరపడిన రాజస్థానీయుల చిరకాల ఆకాంక్ష నెరవేరబోతుంది. రాజస్థాన్‌కు రైలు నడపాలన్న రాజస్థానీయుల విన్నపాన్ని రైల్వే శాఖ నెరవేర్చింది. కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి రాజస్థాన్ జోధ్‌పూర్‌లోని భగత్‌కీకోటికి ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని నిర్ణయించింది. శనివారం సాయంత్రం 5.30 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి భగత్‌కీకోటి ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర మంత్రులు, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజీవ్‌కుమార్ శ్రీవాస్తవతో కలిసి ప్రారంభించనున్నారు. ఈ రైలు (17605) ప్రతీ రోజూ రాత్రి 11.05 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి నిజామాబాద్, ముద్కేడ్, నాందేడ్, పూర్ణ, ఆకోల, ఇటార్సీ, ఉజ్జయినీ, అజ్మీర్ మీదుగా భగత్‌కీకోటి రైల్వే స్టేషన్ చేరుకుంటుంది. 7 స్లీపర్, 7 థర్డ్ ఏసీ, 2 సెకండ్ ఏసీ, 4 జనరల్ బోగీలు, 1 లాగేజీ, 1 దివ్యాంగుల కంపార్ట్‌మెంట్ ఉంటుంది.

వికసించిన పద్మ కమలం

ఎల్బీనగర్‌లోగల ఉషశ్రీ యాదవ్ ఇంట్లో గురువారం రాత్రి పద్మకమలం వికసించింది. తమ ఇంట్లో పద్మ కమలం వికసించడం ఆనందంగా ఉందని, పూజలు చేశామన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



భారీ వర్షం..

కొట్టుకుపోయిన అపార్ట్‌మెంట్, ఓ ఇంటి బేస్‌మెంట్ మట్టి

ఆయా ఇళ్లలో ఉంటున్న వారిని ఖాళీ చేయించిన అధికారులు

పద్మాకాలనీలో కూలిన నాలా ప్రహరీ





శ్రీరామ్‌నగర్, ముషీరాబాద్‌లో పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి, జోనల్ కమిషనర్ రవికిరణ్



పద్మాకాలనీలో కూలిన నాలా ప్రహరీని పరిశీలిస్తున్న డీఎంసీ రామానుజులరెడ్డి

రాంనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పద్మా కాలనీలో నాల ప్రహరీ కూలిపోయింది. నాలా పక్కనే ఉన్న ఓ ఇల్లుతోపాటు, వైష్ణవి అపార్ట్‌మెంట్ బేస్‌మెంట్ మట్టి కొట్టుకుపోయింది. విషయం తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో ఉంటున్న వృద్ధ దంపతులను, అపార్ట్‌మెంట్‌లో 9 ఫ్లాట్లలో ఉంటున్న 40 మందిని ఖాళీ చేయించారు. కొందరు ఖాళీ చేయడానికి నిరాకరించడంతో పోలీసులతో ఖాళీ చేయించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా డీఎంసీ రామానుజులరెడ్డి మాట్లాడుతూ నాలా పక్కనున్న ఇళ్ల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పద్మాకాలనీలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

శ్రీరామ్‌నగర్‌లో ఇళ్లలోకి వరద నీరు

శ్రీరామ్‌నగర్‌లో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. సమాచారం అందుకున్న రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి, డీఈ గీత, హైడ్రా అధికారులు బస్తీని సందర్శించి వర్షపు నీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. బాకారం ఎస్‌వీ చర్చి వద్ద వర్షపు నీరు నిల్వడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఇందిరాపార్కు చౌరస్తాలో వరద నీటి ప్రవాహం

పలు ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీరు

కవాడిగూడ: ఇందిరాపార్కు చౌరస్తా, లోయర్ ట్యాంక్‌బండ్, దోమలగూడ, అరవింద్ నగర్ కాలనీ, ఎన్టీఆర్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద నిలిచిన వరద నీరు వెళ్లేందుకు జీహెచ్‌ఎంసీ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నల్లకుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్లకుంట కార్పొరేటర్ యాకర. అమృత సూచించారు. శుక్రవారం భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. రోడ్లపై వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు.

రాజాడీలక్స్ చౌరస్తాలో రాకపోకలకు అంతరాయం

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో రోడ్లపై వర్షం నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రాజాడీలక్స్ చౌరస్తాలో నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పార్శిగుట్ట చౌరస్తా నుంచి రాంనగర్‌కు వచ్చే వీధిలో వర్షం నీరు వరదలా పారడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. బాపూజీనగర్, వినోభానగర్, ప్రేయర్‌పవర్ చర్చి వీధి, ఆశీర్వాద్ అపార్టుమెంట్, రామాలయం వద్ద వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. రాంనగర్ సెయింట్ పాయిస్ స్కూల్ వద్ద వాహనాలు నిలిచిపోవడంతో విద్యార్థులను తీసుకెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రులు అవస్థపడ్డారు.



రాజాడీలక్స్ చౌరస్తా వద్ద నిలిచిపోయిన వర్షం నీరు

నీటి మునిగిన అరుంధతినగర్

చిక్కడపల్లి: గాంధీ నగర్ డివిజన్ అరుంధతి నగర్ బస్తీలో వరదనీటితో రహదారులు మునిగిపోయాయి. ఇళ్లలోని నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



అరుంధతినగర్ బస్తీలో ప్రవహిస్తున్న వరద నీరు

బోనాల పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి : డీసీపీ

ముషీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఐక్యంగా జరుపుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ కె. శిల్పవల్లి సూచించారు. శుక్రవారం సాయంత్రం ముషీరాబాద్ మహ్మదీయ హాల్‌లో బోనాల పండగ నిర్వాహకులతో సమావేశం చిక్కడపల్లి డివిజన్, సెంట్రల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీసీపీ మాట్లాడుతూ ఫలహారపు బండ్లు, బోనాల ఊరేగింపు ర్యాలీలను త్వరగా ముగించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆలయాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, సీఐలు రాంబాబు, రాజునాయక్, డీఐ నదీమ్ హుస్సేన్, బోనాల ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి

డీజేలకు అనుమతి లేదు : ఏసీపీ

చిక్కడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు చర్యలు తీసుకున్నామని చిక్కడపల్లి ఏసీపీ ఎల్. రమేశ్‌కుమార్ తెలిపారు. డీజేలకు అనుమతి లేదన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేటలో రూ. 10 కోట్లతో సీసీ రోడ్లు

బర్కత్‌పుర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో రూ. 10 కోట్లతో సీసీ రోడ్ల పనులకు ప్రతిపాదనలు రూపొందించామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం బర్కత్‌పుర, లింగంపల్లి చౌరస్తా వద్ద రూ. 1.80 కోట్లతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అన్ని బస్తీల్లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌వో హేమలత, డీఈ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం పదవి కొద్దిలో తప్పిపోయింది

- మల్లికార్జునశర్మను ఎమ్మెల్యే చేయాలనుకున్నా సాధ్యపడలేదు
- మాజీ ఎంపీ వి. హనుమంతరావు

చిక్కడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మంత్రిగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశాననీ, తనకు సీఎం పదవి కొద్దిలో తప్పిపోయిందని మాజీ ఎంపీ వి. హనుమంతరావు అన్నారు. జానకి మల్లికార్జున చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగాన సభలో గాంధేయవాది, నిరాడంబర రాజకీయవేత్త డా. ఉప్పులూరి మల్లికార్జునశర్మ 87వ జయంతి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీహెచ్ మాట్లాడుతూ నేడు రాజకీయాలు దిగజారుతున్నాయని, దుస్తులు మార్చినట్లుగా నాయకులు పార్టీలు మారుతున్నారని, డబ్బుల సంపాదనే ధ్యేయం కావడం మంచి సంస్కృతి కాదన్నారు. భర్త.. భార్యను, భార్య.. భర్తను చంపడం, కూతురు తల్లిని హత్యచేయడం వంటి సంఘటనలు సమాజాన్ని ఎటు తీసుకెళ్తున్నాయో అర్థం కావడంలేదన్నారు. ఉప్పులూరి మల్లికార్జునశర్మ సమాజ సంక్షేమం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వి. హనుమంతరావు

కోసం ఎన్నో కార్యక్రమాలు చేశారని, ఆయన కాంగ్రెస్ పార్టీని వీడలేదన్నారు. రవీంద్రభారతి కార్యదర్శిగా కూడా పనిచేశారని తెలిపారు. మల్లికార్జునశర్మను ఎమ్మెల్యే చేయాలని తాను కృషి చేసినా సాధ్యపడలేదన్నారు. ఈ సందర్భంగా గాయని భూదేవికి డా. ఉప్పులూరి మల్లికార్జునశర్మ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐపీఎస్ విశ్రాంత అధికారి సీఎస్ గోపీనాథ్‌రెడ్డి, డా. వి. నాగేశ్వర్, ఏవీఎన్ శర్మ, కందుకూరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంసీ రామనుజుల రెడ్డి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ముషీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ (డీఎంసీ) రామానుజులరెడ్డి అన్నారు. శుక్రవారం రాంనగర్ సెయింట్ పాయిస్ హైస్కూల్‌లో ఫ్రై డే - డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. అపరిశుభ్ర వాతావరణం వల్ల దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. మొక్కలను నాటి కాలుష్యరహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం. మనోజ్‌రెడ్డి, సీనియర్ ఎంటమాలజీ అధికారి దుర్గాప్రసాద్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లిండా తదితరులు పాల్గొన్నారు.

మహాకాళికి వైద్య సిబ్బంది బోనాలు

ముషీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య సిబ్బంది మహాకాళికి బోనాలు సమర్పించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి పూజలు చేశామని డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయకుమారి, రత్నమాల, సునీత, పద్మలత, యోగా టీచర్ దీప, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అమ్మవారికి శాకంబరి అలంకరణ

మహాకాళిని శుక్రవారం శాకంబరి అలంకరణలో ముస్తాబు చేశారు. అమ్మవారికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పి. శ్రీధర్‌చారి, రేఖ, దేవాదాయ శాఖ ఈవో మహేందర్‌కుమార్ పూజలు చేశారు.



మహాకాళికి సమర్పించేందుకు బోనాలు తీసుకెళ్తున్న వైద్య సిబ్బంది

కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో..

చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలోగల నల్లపోచమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. కార్మికశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డా. గంగాధర్, డీసీఎల్, ఏసీఎల్‌లు, ఎల్‌వోల అమ్మవారికి పూజలు నిర్వహించారు.



అధికారులతో కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేయండి

చిక్కడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ సందర్భంగా గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ వివిధ విభాగాల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం ఎస్ఆర్‌టీ కాలనీలో ఉప్పలమ్మ ఆలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఆలయాల వద్ద పారిశుధ్య పనులు నిర్వహించాలని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఎంసీ రామానుజులరెడ్డి, ఏఎంవోహెచ్ డా. ప్రవీణ, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, ఎస్‌ఐలు కరీమ్, దుర్గ, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్

అడిషనల్ సెక్రటరీగా ఉమాశంకర్‌రెడ్డి

నల్లకుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ 320ఎ అడిషనల్ సెక్రటరీగా పి.ఉమాశంకర్‌రెడ్డి నియమితులయ్యారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్.ఇ.ఎస్.సూర్య నారాయణ తదితరులు పి.ఉమాశంకర్‌రెడ్డిని అభినందించారు.



ఘనంగా అనఘావ్రతం

చిక్కడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోగల లక్ష్మీగణపతి దేవాలయంలో శుక్రవారం అనఘాష్టమి సందర్భంగా అనఘావ్రతం ఘనంగా నిర్వహించారు.పూజలు, అర్చనలు జరిగాయి.

బోనాల ఉత్సవాలకు ఎంపీ లక్ష్మణ్‌కు ఆహ్వానం

ముషీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. బీజేపీ నాయకులు శుక్రవారం ఆయనను కలిసి బోనాల ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, నాయకులు గిరి, బాలు, కృష్ణ పాల్గొన్నారు.



ఎంపీ లక్ష్మణ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బైక్‌లు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

చిక్కడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బైక్‌లను దొంగిలిస్తున్న ఓ వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. డి. రాంబాబు ఈనెల 10వ తేదీ సాయంత్రం జవహర్‌నగర్‌లో తన సోదరి ఇంటి వద్ద బైక్ పార్క్ చేశాడు. రాత్రి 9 గంటల సమయంలో చూడగా వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు 30 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి బైక్ చోరీ చేసిన వ్యక్తి కడపకు చెందిన కె. మధుసూదన్‌రెడ్డిగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఎల్ఈడీ లైట్లు ప్రారంభం

బర్కత్‌పుర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల వేడుకల సందర్భంగా ప్రత్యేక ఆర్చిలను ఏర్పాటు చేశారు. ఆర్చిలకు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లను కార్పొరేటర్ కన్నె ఉమాదేవి శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బోనాల వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు రవియాదవ్, సుధీర్, ప్రవీణ్, చందుయాదవ్ తదితరలుఉ పాల్గొన్నారు.



ఎల్ఈడీ లైట్లను ప్రారంభించిన కార్పొరేటర్ కన్నె ఉమాదేవి